# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

శనివారం ı 2 ı ఆగస్టు ı 2025






### వచ్చారు.. వెళ్లారు..!

కడప కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్‌ల వ్యవహారం కొనసాగుతూనే ఉంది. అధికారుల 'నామమాత్రపు విచారణ'పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

-8లో



### ఎమ్మెల్యే ఎదుటే బాహాబాహీ

మైదుకూరులో టీడీపీలో వర్గవిబేధాలు భగ్గుమన్నాయి. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మాజీ ఎంపీపీ ధనపాల జగన్ మోహన్ మధ్య గొడవలు చెలరేగాయి.

-8లో

గరిష్టం/కనిష్టం
36.6/25.9

### వాతావరణం

జిల్లాలో శుక్రవారం 25.9 - 36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### 5 నుంచి వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు

**కడప ఎడ్యుకేషన్:** యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలలకు అన్ని సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 5 నుంచి ఇన్‌స్టెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావు వెల్లడించారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులు హాజరుకావాలని ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని కళాశాల విద్యార్థులు యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రాంగణం లోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో పరీక్షలు రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హాల్ టికెట్లను కళాశాలల నుంచి పొందాలని సూచించారు.

### నియామకం

**కడప కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన పలువురిని ఆ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.తంబళ్లపల్లెకు చెందిన ఆర్‌సీ ఈశ్వర్‌రెడ్డిని స్టేట్ పబ్లిసిటీ వింగ్ సెక్రటరీగా, రాయచోటికి చెందిన వి.వెంకటరమణను స్టేట్ పబ్లిసిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా, రాజంపేటకు చెందిన మారుతిరావును స్టేట్ సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమించారు.

### 3న వెలిగల్లు నుంచి నీటి విడుదల

**గాలివీడు:** వెలిగల్లు కుడికాలువ గేట్లు ఈనెల 3వ తేదిన ఉదయం 9 గంటలకు ఎత్తి నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈఈ బి.భాస్కర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతుల విజ్ఞప్తి మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.ఈకార్యక్రమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

### వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

**కడప కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన పలువురిని ఆ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జమ్మలమడుగుకు చెందిన ఎం.శివకుమార్‌ను స్టేట్ మున్సిపల్ విభాగం కార్యదర్శిగా, కడపకు చెందిన పి.సునీతారెడ్డిని స్టేట్ సోషల్ మీడియా విభాగం కార్యదర్శిగా, కమలాపురానికి చెందిన బాలసత్య రామరాజును స్టేట్ సోషల్ మీడి యా విభాగం జాయింట్ సెక్రటరీ, మైదుకూరుకు చెందిన మహమ్మద్ దస్తగిరిని స్టేట్ సోషల్ మీడియా విభాగం జాయింట్ సెక్రటరీలుగా నియమించారు.

### 5న స్పాట్ అడ్మిషన్లు

**కడప ఎడ్యుకేషన్:** కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఆగస్టు 5వ తేదీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. కళాశాలలోని సివిల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ఆగస్టు 4వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనర్హులని తెలిపారు. కేటగిరీ వారీగా దాదాపు రూ. 6 వేలు వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. పాలిసెట్-2025 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

### 8న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

**కడప కోటిరెడ్డిసర్కిల్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో గిరి ప్రదక్షిణ కోసం వెళ్లే వారి కోసం ఆగస్టు 8న ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 8న సాయంత్రం 4.30 గంటలకు కడప డిపో రాయచోటి, పీలేరు మీదుగా సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. ఇందులో టిక్కెట్ ధర రూ. 1044గా ఉందన్నారు. బద్వేలు డిపో నుంచి ఉదయం 9.00 గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుందన్నారు. ఇందులో రూ. 1282 ఛార్జిగా నిర్ణయించారన్నారు. మైదుకూరు డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని, ఇందులో రూ. 1352 ఛార్జిగా నిర్ణయించారన్నారు. ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందని, ఇందులో టిక్కెట్ ధర రూ. 1273లు. పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు రాయచోటి, పీలేరు మీదుగా నడుస్తుందన్నారు. ఇందులో చార్జి రూ. 1233గా ఉందన్నారు. సాయంత్రం 5.00 గటలకు జమ్మలమడుగు డిపో నుంచి సూపర్ లగ్జరీ సర్వీసు ప్రొద్దుటూరు, కడప మీదుగా నడుస్తుందన్నారు. ఇందులో చార్జీగా రూ. 1352 చొప్పున నిర్ణయించారని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# బాబు నోట.. అబద్ధాల మూట!

- నిస్సిగ్గుగా అసత్యాలు వల్లెవేసిన సీఎం చంద్రబాబు
- గండికోటకు రెండు సార్లు శిలాఫలకం వేసి పైసాకూడ నిధులు కేటాయించలేదు
- వైఎస్సార్ హయంలోనే రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు మోక్షం



ప్రజావేదిక కార్యక్రమంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

**జమ్మలమడుగు:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ పాతపాటే పాడారు.. ఎప్పట్లాగే అబద్ధాలే వల్లె వేశారు. 'రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా... జిల్లాను పర్యాటక హబ్‌గా చేస్తా..' అంటూ అవే డాంబికాలు పోయారు. 2014లో మొదలుపెట్టిన రాగాన్నే మళ్లీ సవరించారు. ఇప్పటివరకు రెండుసార్లు సీఎం హోదాలో పని చేసినా ఇంతవరకు రూపాయి విదిల్చింది లేదు. పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందిన దాఖలా అస్సలు లేదు. ప్రపంచ పర్యాటకకేంద్రంగా ఉన్న గండికోటలో హరిత హోటల్ నిర్మాణం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలోనే జరిగింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సరైన మౌళిక సదుపాయాలు సైతం కల్పించలేకపోయారు.

**గండికోట ప్రాజెక్టుకు రెండు సార్లు శిలాఫలకం వేసి ఏం చేశారు..**

గండికోటప్రాజెక్టు నిర్మాణం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు సార్లు శిలాఫలకం వేశారు. ఏనాడు ప్రాజెక్టు నిర్మాణం కోసం మొగ్గు చూపలేదు. 2004లో మహనేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గండికోట ప్రాజెక్టు నిర్మాణం కోసం శ్రీకారం చుట్టారు. 22 గ్రామాల ప్రజలకు పరిహారం ఇచ్చి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 90 శాతం పనులు నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే పూర్తయ్యాయి. కేవలం పదిశాతం పనులు మాత్రమే చంద్రబాబు పూర్తి చేసి తామే ప్రాజెక్టు పూర్తి చేశామని చెబుతుండటంతో జిల్లావాసులు, నియోజకవర్గంలోని ప్రజలు నవ్వుకుంటున్నారు. అంతేకాకుండా టీడీపీ ప్రభుత్వం రాయలసీమకు సాగు, తాగునీరు అందించేందుకు హంద్రీనీవా-గాలేరు-నగరి ప్రాజెక్టులు శ్రీకారం చుట్టామని చంద్రబాబు చెబుతున్నారు. మహనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి ఏకంగా గాలేరు-నగరి కాలువల్లో 20 వేల క్యూసెక్కులు వరద నీరు ప్రవహించేవిధంగా కాలువలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా అవుకు, లింగాపురం వద్ద కొండలకు టన్నెల్ వేసి నీటిని గండికోట ప్రాజెక్టుకు తరలించేవిధంగా చర్యలుచేపట్టిన ఘనత వైఎస్‌దే అని జిల్లావాసులకు తెలియందికాదు. అలాంటి ప్రాజెక్టును తామే పూర్తి చేశామని సమావేశంలో చంద్రబాబు మాట్లాడటం విడ్డూరంగా ఉందని నియోజకవర్గ వాసులు ఎద్దేవా చేస్తున్నారు. ఇక మైలవరం ప్రాజెక్టు నిర్మాణం సమయంలో కనీసం టీడీపీనే ఆవిర్భవించలేదని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కాసు బ్రహ్మానందరెడ్డి 1974లో 100కోట్ల రూపాయలతో మైలవరం జలాశయం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. దానిని 1983 నాటికిపూర్తి చేస్తే అప్పటి ముఖ్యమంత్రిగా ఎన్‌టీరామారావు ప్రారంభోత్సవం చేశారే తప్ప టీడీపీ చేసిందేమీ లేదు. కాలువల్లో నీరు ప్రవహించపోవడం, చివరి ఆయకట్టురైతుకు మైలవరం జలాశయం నుంచి నీరు అందకపోవడంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మైలవరం ఉత్తర,దక్షిణ కాలువలకు 150 కోట్ల రూపాయలతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఉత్తర కాలువ రత్న కంపెనీ, దక్షిణ కాలువ పనులను సీఎం రమేష్ నాయుడు కు చెందిన రిత్విక్ కంపెనీ చేసింది. ఈ విషయం కూడా చంద్రబాబు తెలియకుండా మైలవరం ప్రాజెక్టు సైతం తామే పూర్తిచేశామని చెప్పుకోవడం పట్ల ప్రజలందరూ విస్మయం వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిస్థాయిలో టీడీపీ ప్రభుత్వం గాని చంద్రబాబునాయుడు గాని నిర్మించిన దాఖలాలులేవు. వచ్చిన ప్రతిసారి ఊకదంపుడు ఉపన్యాసాలు తప్పా జిల్లాకు చేసిందేమీలేదని జిల్లా ప్రజలు వాపోతున్నారు. కాగా చంద్రబాబు ప్రసంగిస్తున్నంత సేపు జనాలు విసుగెత్తిపోయి చూస్తూ ఉండిపోతున్నారే తప్ప ఎటువంటి మద్దతు ప్రకటించకపోవడం గమనార్హం. ప్రాజెక్టుల విషయంలో చంద్రబాబు చెప్పిన మాటలన్ని సుద్ద అబద్ధాలే అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### స్టీల్ ప్లాంట్ కోసం..

2019 జనవరి 24న మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన చంద్రబాబు ప్లాంట్ నిర్మాణం కోసం ఒక సెంటు భూమి కూడా కేటాయించలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో సున్నపురాళ్లపల్లె వద్ద 3000 ఎకరాలు వైఎస్సార్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భూమిని కేటాయించడంతోపాటు 70 కోట్ల రూపాయలతో పనులను కూడా చేపట్టారు. స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన బాధితులకు పట్టాగలిగిన రైతులకు పరిహారం అందించారు. జిందాల్ కంపెనీ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ముందుకు తీసుకొని వచ్చారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఆ ప్రాంతంలోనే స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం చర్యలు చేపట్టింది.





## చివరిరోజు 32 నామినేషన్లు

- పులివెందుల స్థానానికి 12
- ఒంటిమిట్ట స్థానానికి 20

**కడప సెవెన్‌రోడ్స్:** పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి రోజు 32 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో పులివెందుల స్థానానికి 12, ఒంటిమిట్ట స్థానానికి 20 నామినేషన్లు వచ్చాయి.

**పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి..**

పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం అభ్యర్థిగా మారెడ్డిజయభారత్‌రెడ్డి, మారెడ్డి లతారెడ్డి రెండు సెట్ల చొప్పున నామినేషన్లు వేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డి, మొయిళ్ల శివ కల్యాణ్‌రెడ్డి నామినేషన్ వేశారు. స్వతంత్ర్య అభ్యర్థులుగా అంకిరెడ్డి సురేష్‌కుమార్‌రెడ్డి, భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, ముద్దుగారి వెంగళరెడ్డి, యాదటి సునీల్ యాదవ్, నాగేళ్ల సాంబశివారెడ్డి, మరుజోళ్ల గజేంద్రనాథరెడ్డి నామినేషన్లు వేశారు.

**ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి..**

ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరుపున ముద్దుకృష్ణారెడ్డి అడ్డలూరు, కడప బాబుసాహెబ్, బొడ్డె వెంకట రమణ, వెంకటేశ్ నంద్యాల, ఈశ్వరయ్య తుమ్మలకుంట్ల, వెంకట సుబ్బయ్య ఆలూరు, కుమారి శివ రామకృష్ణారెడ్డి, నల్లగొండు వెంకట సుబ్బారెడ్డి, బోడె వెంకట రమణ, దున్నుతల రఘురామిరెడ్డి నామినేషన్ వేశారు. వైఎస్సార్ సీపీ తరపున ఇరగంరెడ్డి శ్రీకర్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున పూల విజయభాస్కర్ అలియాస్ పూల భాస్కర్ నామినేషన్లు వేశారు. జనసేన పార్టీ తరుపున రాటాల రామయ్య, కోనేటి హరి వెంకట రమణ నామినేషన్లు దాఖలు చేశారు. ఇక స్వతంత్య అభ్యర్థులుగా అరిగేల సావిత్రి చంద్రనాథ్, రేవిళ్ల బాల మునెయ్య, మామిళ్ల ఈశ్వరయ్య, గండు మల్లి కార్జునరెడ్డి, నడివీధి సుధాకర్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

# ఏపీఎల్-2025 ట్రోఫీ మనదే !

**రాయల్స్ ఆఫ్ రాయలసీమ యాజమాన్యం ధీమా**



సమావేశంలో మాట్లాడుతున్న రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు యజమాని శ్రీధర్

**కడప వైఎస్ఆర్ సర్కిల్:** విశాఖపట్నంలో ఈనెల 8వ తేదీ నుంచి జరగనున్న ఆంధ్ర ప్రీమియం లీగ్-2025 (ఏపీఎల్-2025) లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించి చాంపియన్‌గా నిలుస్తుందని రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు యజమాని శ్రీధర్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 8 నుంచి వైజాగ్ లో ఆంధ్ర ప్రీమియం లీగ్- 2025 మ్యాచ్‌లు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఏపీఎల్- 2025లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు పాల్గొంటుందని చెప్పారు. కడపలోని వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు సాధన చేసేందుకు వచ్చిందని వివరించారు. ఈనెల 5వ తేదీ వరకు రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు క్రీడాకారులు ఇక్కడే సాధన చేస్తారన్నారు. ఆరో తేదీ జట్టు సభ్యులందరూ వైజాగ్ కు బయలుదేరి వెళ్తారన్నారు. వైయస్ రాజారెడ్డి ఏసిఏ స్టేడియంలో సాధన చేసుకునేందుకు అన్ని వసతులు అద్భుతంగా ఉన్నాయన్నారు. రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు హీరోలు చాలా స్ట్రాంగ్ గా ఉన్నారని, ఏ పీ ఎల్- 2025 ఛాంపియన్స్ గా జట్టును నిలబెడతారన్న ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. ఈనెల 9వ తేదీన మొదటి మ్యాచ్ విజయవాడ సన్ షైన్ జట్టుతో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు ఆడబోతుందన్నారు. రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు హెడ్ కోచ్ పైడికాల్వ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఐపీఎల్ -2025 మ్యాచ్ లలో తమ జట్టు తప్పక విజయం సాధిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు సహ యజమాని రాజారెడ్డి, రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు క్రీడాకారులు రషీద్, పైలా అవినాష్ పాల్గొన్నారు.

# అత్యధిక మెజార్టీతో ఇరగంరెడ్డిని గెలిపించండి

**ఎమ్మెల్యే ఆకేపాటి, కడప మేయర్ సురేష్ బాబు**



ఓటు వేయాలని ప్రజలను అడుగుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, చిత్రంలో మేయర్ సురేష్‌బాబు, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

**ఒంటిమిట్ట:** ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు ప్రజలను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని రాచగుడిపల్లి, సీతాపురం, గొల్లపల్లి, రాచపల్లి గ్రామాల్లో జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఉప ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారానికి ఆకేపాటి అమరనాథరెడ్డి, సురేష్ బాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ..సుబ్బారెడ్డిని గెలిపించుకుంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిచి, ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వస్తారన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి, ఆర్థిక స్థితి గతులను మారుస్తారన్నారు. కడప మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అవిర్భావం అయినప్పటి నుంచి ఒంటిమిట్ట జెడ్పీటీసీని వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వారే దక్కించుకుంటున్నారన్నారు. ఈ సారి కూడా ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ని గెలిపించి, ఒంటిమిట్ట చరిత్రను తిరగ రాయాలని ప్రజలను కోరారు. ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ..తాను ఒంటిమిట్ట మండల ప్రజలకు సుపరిచితున్ని అన్నారు. నన్ను గెలిపిస్తే మండల ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుంటానని, వాటిని పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, రాజంపేట నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్‌రెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ దున్నూతల లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మేకపాటి నందకిశోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వె వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసుల రెడ్డి, గురుమోహన్‌రాజు, రవిరాజు, నాగార్జున్ రాజు, రవిరెడ్డి, కత్తి శివయ్య పాల్గొన్నారు.

# పార్టీకి వలంటీర్స్ విభాగం కీలకం





వలంటీర్ల విభాగం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, సమావేశానికి హాజరైన జిల్లా వలంటీర్ల విభాగం నాయకులు

- పార్టీని ముందుకు తీసుకెళ్లే బృహత్తర బాధ్యత వారిపై ఉంది
- జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

**కడప కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వలంటీర్స్ విభాగం ఎంతో కీలకమైనదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామాంజనేయపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వలంటీర్స్ విభాగం విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీలో యువజన, విద్యార్థి, వలంటీర్స్ విభాగాలు కొత్త తరానికి ప్రతిరూపాలన్నారు. కూటమి ప్రభుత్వం అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, వారు ఇచ్చిన హామీలను ఇంటింటికీ వెళ్లి గుర్తు చేయాలన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి దుర్మార్గమైన పాలన లేదని, దోచుకోవడానికి, దాచుకోవడానికే వారు అధికారంలోకి వచ్చారన్నారు. కూటమి అధికారంలోకి వస్తే వలంటీర్లకు పదివేలు ఇస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే వన్ ప్లస్ వన్ ఆఫర్ అన్నట్లు కరువు ఫ్రీగా వస్తుందని ఎద్దేవా చేశారు.

**రాష్ట్రంలో ఎల్లో ఎమర్జెన్సీ- రాష్ట్ర వలంటీర్స్ విభాగం అధ్యక్షుడు నాగార్జున యాదవ్**

రాష్ట్రంలో ఎల్లో ఎమర్జెన్సీ నడుస్తోందని రాష్ట్ర వలంటీర్ల విభాగం అధ్యక్షుడు నాగార్జున యాదవ్ విమర్శించారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్‌ను జనం నుంచి దూరం చేసే కుట్ర జరుగుతోందని, అందుకు ప్రభుత్వం పడరాని పాట్లు పడుతోందన్నారు. జేసీబీలతో రోడ్లు తవ్వి, వాహనాలు ఆపి జనాలను అడ్డుకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో 3లక్షల మంది జగన్ సైన్యాన్ని తయారు చేస్తామన్నారు. వైఎస్ జగన్‌కు, చంద్రబాబుకు మధ్య ఒకే ఒక్క తేడా ఉందని, జగన్ అబద్ధాలు చెప్పడు, చంద్రబాబు నిజాలు చెప్పడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను గ్రామస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలన్నారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వలంటీర్స్ విభాగం రాయలసీమ జోన్ అధ్యక్షుడు అఖిలేష్ మాట్లాడారు. జిల్లా వలంటీర్స్ విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర వలంటీర్స్ విభాగం ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగమల్లారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, కడప అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు వంశీ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సేవా స్ఫూర్తితో పనిచేయాలి: మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

వలంటీర్ల విభాగంలోని వారంతా సేవా స్ఫూర్తితో పనిచేయాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో 2.50లక్షల మంది వలంటీర్లను నియమించి వారి ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. వలంటీర్లంతా జగన్ సైన్యమన్నారు. పార్టీ కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తే భవిష్యత్‌లో మంచి అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రంలో అవినీతిమయమైన అరాచకపాలన సాగుతోందని.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ 2.0లో కార్యకర్తలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

## 'గండికోట'కు కృష్ణా జలాలు

**కొండాపురం:** అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరి నగరి సృజలస్రవంతి ప్రధాన కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులనీరు గండికోట జలాశయంలోకి చేరినట్లు శుక్రవారం జీఎన్ ఎస్ఎస్ ఎస్ఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 18 వేల క్యూసెక్కులనీరు అవుకు రిజర్వాయర్ వచ్చి చేరుతున్నాయి. అవుకు రిజర్వాయర్‌నుంచి 6500 క్యూసెక్కులనీరు వదలడంతో సుమారు 54 కిలో మీటర్ల దూరం నుంచి జీఎన్ ఎస్ఎస్ కాలువ నుంచి గండికోట జలాశయంలో వస్తున్నాయి. గండికోట జలాశయం పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసిలు ఉండగా ప్రస్తుతం 10.3టీఎంసీలు నీరు నిల్వ ఉందని వెల్లడించారు. గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 1500 క్యూసెక్కులనీరు, అలాగే జీఎన్ఎస్ఎస్ మెయిన్ కాలువ ద్వారా శెట్టివారిపల్లె రెగ్యూలేటర్ నుంచి 400 క్యూసెక్కుల నీటిని వామికొండ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్నామన్నారు. అలాగే గండికోట ఎత్తిపోతలపథకం నుంచి చిత్రావతి బ్యాలెన్స్ రిజర్వాయర్‌కు రెండు మోటర్లతో 1000 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నామన్నారు.



గండికోట జలాశయంలోకి వస్తున్న కృష్ణాజలాలు

## క్లుప్తంగా

### సెల్‌ఫోన్లు రికవరీ

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ పరిధిలో సెల్‌పోన్లు పోగొట్టుకున్న బాధితులకు రైల్వే పోలీసులు రికవరీ చేసి అప్పగించారు. శుక్రవారం స్థానిక రైల్వే ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోయాయంటూ తమకు ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ సీఈఐఆర్ విధానం ద్వారా సెల్‌ఫోన్లు గుర్తించి వాటిని దొంగల నుంచి రికవరీ చేశామన్నారు. నాలుగు సెల్‌ఫోన్‌ల విలువ రూ.53 వేల వరకు ఉంటుందన్నారు.

### భార్యపై కరెంట్ వైర్లతో దాడి

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో సప్తగిరి అనే వ్యక్తి తన భార్యపై కరెంట్ వైర్లతో దాడి చేసిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాష్ నగర్ కు చెందిన సప్తగిరికి 5 సంవత్సరాల క్రితం వైష్ణవితో వివాహమైంది. భార్యను తరచు వేధించేవాడని, అయితే కరెంటు వైర్లతో గురువారం ఇష్టానుసారంగా చితకబాదడంతో తీవ్ర గాయాల పాలైంది. ఈ మేరకు వైష్ణవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### అరటికాయల వ్యాపారి ఆత్మహత్య



ఆంజనేయ నాయక్ (ఫైల్)

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డి పల్లె సమీపంలో ఉన్న ఎర్రబల్లె తండాలో నివాసముంటున్న ఆంజనేయ నాయక్(42) అనే అరటి కాయల వ్యాపారస్తుడు గడ్డి నివారణ మందు సేవించి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆంజనేయ నాయక్ అరటి కాయల వ్యాపారం చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పులివెందుల ప్రాంతంలోని అరటికాయలను ఢిల్లీ వ్యాపారస్తులకు ఎగుమతి చేసేవాడు. ఈ నేపథ్యంలో ఢిల్లీ వ్యాపారస్తులు సుమారు లక్షలాది రూపాయల డబ్బులు పంపించకపోవడంతో ఆంజనేయ నాయక్ పులివెందుల ప్రాంతంలోని రైతులకు చెప్పుకోలేక గడ్డి మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. గడ్డి గడ్డి మందు సేవించిన ఆంజనేయ నాయక్‌ను చికిత్స కోసం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





# ఎమ్మెల్యే ఎదుటే చైర్మన్, మాజీ ఎంపీపీ బాహాబాహీ



ఇరు వర్గాల మధ్య వాగ్వాదంతో ఏర్పడిన గందరగోళం



మాజీ ఎంపీపీని వారిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



వాగ్వాదం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

- మున్సిపాలిటీలో భగ్గుమన్న ప్రత్యర్థుల విభేదాలు
- రసాభాసగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం

మైదుకూరు : మైదుకూరులో టీడీపీలో వర్గవిభేదాలు భగ్గుమన్నాయి. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మాజీ ఎంపీపీ ధనపాల జగన్ మోహన్ మధ్య గొడవలు చెలరేగాయి. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలోనే వారు ఇరువురు బాహాబాహీకి దిగారు. దీంతో అధికార పింఛన్ల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు నుంచి వైఎస్సార్‌సీపీకి దూరంగా ఉంటున్న మున్సిపల్ చైర్మన్ పార్టీకి రాజీనామా చేయక ముందు నుంచే టీడీపీలో చేరుతారనే వార్తలు వచ్చాయి. అయితే ఆయన టీడీపీలో చేరడాన్ని అప్పటికే ఆ పార్టీలో ఉన్న నాయకులు వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మాచనూరు చంద్రకు మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యర్థిగా ఉన్న ధనపాల జగన్‌మోహన్ అవకాశం వచ్చినప్పుడల్లా ఆయనపై మాటల దాడి చేస్తున్నారు. తాజాగా పట్టణంలోని మూలబాట వీధిలో జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 14వ వార్డు పరిధిలో ఉన్న మూలబాట వీధిలో శుక్రవారం వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కొత్త పింఛన్లను పంపిణీ చేస్తారని అటు మున్సిపాలిటీ అధికారులు, ఇటు టీడీపీ నాయకులు ప్రకటించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మంత్రి కన్నా ముందుగా వచ్చారు. ఉదయం 10.40 గంటల ప్రాంతంలో వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ పందిటి వెంకటలక్ష్మమ్మ, కుటుంబ సభ్యులు శాలువాతో ఎమ్మెల్యేను సత్కరిస్తుండగా.. ఎమ్మెల్యే పక్కనే ఉన్న మాజీ ఎంపీపీ ధనపాల జగన్ ఎమ్మెల్యేకు అటువైపు నిలబడి ఉన్న మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్రను నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావు అంటూ తోసేశారు. నన్ను ఎందుకు తోస్తున్నావు అంటూ మున్సిపల్ చైర్మన్ ప్రశ్నించారు. ఒక వైపు మున్సిపల్ చైర్మన్ కుటుంబ సభ్యులు, మరో వైపు మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులు గట్టిగా అరుస్తూ దూషించుకోవడం ప్రారంభించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఇరు వర్గాలను వారించారు. అక్కడే ఉన్న టీడీపీ నాయకులు ఇరు వర్గాలకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. ఎమ్మెల్యేకు ఓటు కూడా వేయని మున్సిపల్ చైర్మన్‌కు ఇక్కడేం పని అంటూ మాజీ ఎంపీపీ జగన్‌మోహన్ కేకలు వేశారు. ఇరువర్గాలు తోసుకోవడంతో అక్కడ గందరగోళం ఏర్పడింది. ఇరువర్గాలపై ఆగ్రహించిన ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ 'ఏం చేస్తున్నారు మీరు.. ఏమనుకుంటున్నారు, రౌడీయిజం చేస్తున్నారా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడున్న వారంతా సర్దిచెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం సద్దుమణిగింది. అదే సమయంలో మంత్రి సవిత అక్కడికి చేరుకోవడంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**మున్సిపల్ ఎన్నికల నుంచి విభేదాలు**

మాచనూరు చంద్ర, మాజీ ఎంపీపీ ధనపాల జగన్ మోహన్ మధ్య మున్సిపల్ ఎన్నికల నుంచి విభేదాలు ఉన్నాయి. చంద్ర వైఎస్సార్‌సీపీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయగా, ధనపాల జగన్ భార్య భారతి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఎన్నికల్లో చంద్ర మున్సిపల్ చైర్మన్ అయ్యారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు నుంచి ఆయన వైఎస్సార్‌సీపీకి దూరంగా ఉన్నారు. ఈ ఏడాది మే 15న పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మైదుకూరు నాలుగు రోడ్ల కూడలిలో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ అధికారులు ఈ ఏడాది జనవరి 15న ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహావిష్కరణ చేసేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ రాగా అందులో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర కూడా పాల్గొన్నారు. ఆ సమయంలో కూడా మాజీ ఎంపీపీ ధనపాల జగన్, మా కార్యక్రమంలో నువ్వు ఎలా పాల్గొంటావు.. ఇక్కడికి ఎందుకు వచ్చావు అంటూ మున్సిపల్ చైర్మన్‌ను నిలదీశారు. అప్పుడు కూడా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇప్పుడు తాజాగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలోనూ వారి మధ్య ఉన్న విభేదాలు బట్టబయలై కార్యక్రమాన్ని రసాభాసగా మార్చాయి. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ప్రొటోకాల్ మేరకు పాల్గొన్న మున్సిపల్ చైర్మన్‌కు భంగపాటు ఎదురుకావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

### కులం పేరుతో దూషించిన కేసులో జైలు

కడప అర్బన్ : సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో కులం పేరుతో ఓ మహిళను, ఆమె భర్తను దూషించిన కేసులో నిందితుడైన వెలుగోటి రామలింగేశ్వరరెడ్డికి 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కడప నాలుగవ అదనపు జిల్లా కోర్ట్ న్యాయమూర్తి జి.దీనా బాబు శుక్రవారం తీర్పు ఇచ్చారు. 2018 మే నెల 4వ తేదీన వెలుగోటి రామలింగేశ్వరరెడ్డి, ఫిర్యాది చింతలపల్లి అంకాలమ్మకు చెందిన పొలంలో అక్రమంగా ప్రవేశించి గుంతలు తీసినట్లు, ఆ విషయం తెలుసుకొని ఆమె అతని ఇంటి వద్దకు పోయి ఎందుకు తమ పట్టా పొలంలో గుంతలు తీశారని అడిగారు. అంకాలమ్మ మీ పైన మేము కేసు పెడతాము అని చెప్పగా, దానికి రామలింగేశ్వరరెడ్డి కోపంతో ఆమెను, ఆమె భర్తను కులం పేరుతో దూషించినట్లు, కేసు కాకపోతే ఏమైనా పెట్టుకోమని బెదిరించినట్లు, పొలం పాడు చేసి, గుంతలు చేసినట్లు 2018 జూన్ 28న తేదీన సింహాద్రిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సింహాద్రిపురం పోలీసు వారు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. శుక్రవారం సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడురుకు చెందిన వెలుగోటి రామలింగేశ్వరరెడ్డి(59) పైన కోర్టులో విచారణ చేయగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి దీనాబాబు మూడు సంవత్సరముల జైలు శిక్ష, 10 వేల రూపాయల జరిమానా విధించినారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన పి.పి బాలాజీ, పోలీస్ సిబ్బందిని కడప జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ అభినందించారు.

# నేడు గండిలో రెండో శ్రావణ శనివారోత్సవం



విద్యుద్దీపాల వెలుగులో గండి ఆలయ ప్రాంగణం

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో నేడు రెండో శ్రావణ మాస శనివారోత్సవం జరుగనుంది. గత వారం కంటే ఈవారం భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని భావించిన ఆలయ వర్గాలు అందుకు సరిపడ ఏర్పాట్లు చేశారు. గత వారంలో తలెత్తిన చిన్నచిన్న లోపాలను సరిదిద్ది ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేశామని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. భక్తుల అంచనాల మేరకు లడ్డూ, పులిహోర ప్రసాదాలను సిద్ధం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఉదయం 3గంటలకు సుప్రభాతసేవ, ఉత్సవమూర్తులకు అభిషేకం (ఏకాంతంగా), అలంకరణ, ఆరాధన, 5 గంటలకు మహామంగళ హారతి, అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుందని ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజా రమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. అలాగే రాత్రి బస చేయు భక్తుల కాలక్షేప నిమిత్తం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు, అధికారులు సహకరించాలని చైర్మన్ కోరారు.

**పరిస్థితిని బట్టి ట్రాఫిక్ ఆంక్షలు**

శ్రావణ మాస ఉత్సవాల రెండవ శనివారం భక్తుల రద్దీని బట్టి ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్సై రంగారావులు తెలిపారు. పరిస్థితిని బట్టి లారీలు, టిప్పర్లు తదితర వాటిని వేంపల్లె వైపు నుంచి వచ్చే వాటిని ఇడుపులపాయ క్రాస్ వద్ద, రాయచోటి వైపు నుంచి వచ్చే వాటిని అద్దాలమర్రి క్రాస్ వద్ద ఆపేస్తామన్నారు. బస్సులు, కార్లు తదితరాలను భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని తదుపరి చర్య తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా పులివెందుల డీఎస్పీ, సీఐలు, ఎస్సైలతోపాటు సుమారు 130 మంది వరకు సిబ్బందితో బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

**రక్తదాన శిబిరం ఏర్పాటు**

రక్త దానం చేసి అపాయంలో ఉన్న ఇతరుల ప్రాణాలను కాపాడాలని ట్రిపుల్ ఐటీకి చెందిన ప్రసాద్ తెలిపారు. గండిలో రక్తదాన శిబిరం కడప రిమ్స్ వారి సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

# 'ఇన్ఫోసిస్' నేత్ర బ్యాంక్ ఏర్పాటు



ఐ బ్యాంకును ప్రారంభిస్తున్న జిల్లా అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ప్రాంగణంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ నేత్ర బ్యాంక్ ఆవిష్కరించటం జిల్లా ఆరోగ్య సంరక్షణకు అదనపు విలువ జోడిస్తుందని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, స్పెషల్ కలెక్టర్ ఎస్.నిత్యానంద రాజు, రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వర రావు, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రామ గిడ్డయ్యలు తెలిపారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో శుక్రవారం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఐ బ్యాంక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఐ బ్యాంక్ విస్తరణ పరిధిలో ఇది అయిదవదని తెలిపారు. ఈ నేత్ర బ్యాంక్‌కు అవసరమైన పరికరాలను ఇన్ఫోసిస్ సమకూరుస్తుందని, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల మౌలిక సదుపాయాలను అందిస్తుందన్నారు. కడపలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల వద్ద ప్రారంభించిన హాస్పిటల్ కార్నియా రిట్రీవల్ ప్రోగ్రాం (హెచ్‌సీపీఆర్) ద్వారా స్వచ్ఛంద నేత్ర దానాలు, విరాళాలను ఇన్ఫోసిస్ ఐ బ్యాంక్ సేకరిస్తుందన్నారు. ఈ నేత్ర బ్యాంక్ పరిసర ప్రాంతాల ప్రజల కార్నియా మార్పిడి చికిత్స అవసరాలను తీరుస్తుందని వివరించారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ట్రస్టీ సునీల్ కుమార్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ హెడ్ మనీషా సబూ, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్‌లు మాట్లాడుతూ ఈ అత్యాధునిక ఐ బ్యాంక్‌ను స్థాపించడంలో ప్రసాద్ నేత్ర వైద్యశాలతో భాగస్వామ్యం కావటం సంతోషంగా ఉందన్నారు. ఇన్ఫోసిస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఫైనాన్స్ - ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ట్రస్టీ సునీల్ కుమార్ ధరేస్వర్, ఇన్ఫోసిస్ హెడ్ మనిషా సాబూ వర్చువల్ విధానం ద్వారా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల టెక్నాలజీ - కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కృష్ణ వడ్డవల్లి, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్ ఎమిరేట్స్ రామం ఆత్మకూరి, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల రాజశేఖర్‌రెడ్డి క్యాంపస్ హెడ్ డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి, నెట్ వర్క్ అసోసియేట్ డైరెక్టర్ ఐ బ్యాంక్ హరిహరన్‌తోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం సభలో బతుకు పోరాటం




ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీ-4 పథకం కింద నిరుపేదలను బంగారు కుటుంబం పేరుతో దత్తత తీసుకుని వారికి ఉజ్వల భవిష్యత్తు అందించాలని ఒకవైపు ఉపన్యాసం ఇస్తుంటే.. మరోవైపు పది సంవత్సరాల బాలుడు తన బతుకు పోరాటం కొనసాగిస్తున్నాడు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగం సాగుతుంటే.. బాలుడు వేరుశనగ కాయల గంప చేతితో పట్టుకుని సమావేశానికి హాజరైన ప్రజల వద్దకు వెళ్లి అమ్మకాలను కొనసాగిస్తున్నాడు. కొంత మంది అధికారులు సైతం ఆ బాలుడు వద్ద నుంచి వేరుశనగ కాయలు కొనుగోలు చేశారు. ముఖ్యమంత్రి సమావేశంలోనే బాలుడు తన బతుకు పోరాటం కొనసాగిస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. – జమ్మలమడుగు

## మాకు వర్తించదా పీ ఫోర్..




జమ్మలమడుగు నియోజకవర్గం గూడెం చెరువులో పీఫోర్ (బంగారు కుటుంబాల లబ్ధిదారుల) సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేశారు. ప్రజా వేదిక ప్రవేశ ద్వారంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన సీఎం ఫ్లెక్సీ కింద ముద్దనూరుకు చెందిన మహిళ తన ముగ్గురు సంతానంతో కలిసి యాచిస్తోంది. అందులో ఒకరు గాంధీ వేషధారణలో ఉండటం గమనార్హం. అక్కడి సదస్సుకు వచ్చిన వారు అయ్యో పాపం వీరికి పీ ఫోర్ వర్తించదా అనుకుంటూ వెళ్లారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

# దొంగకు దేహశుద్ధి



యువకుడిని ట్రాక్టర్‌కు కట్టేసిన గ్రామస్తులు

సింహాద్రిపురం : ఓ దొంగను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సింహాద్రిపురం మండలంలోని సుంకేసుల గ్రామంలో కాకర్ల భాస్కర్‌రెడ్డి భార్య తన ఇంటి వద్ద శుక్రవారం కల్లాపు చల్లుతూ ఉండగా.. బైకుపై ఇద్దరు వ్యక్తులు వచ్చారు. బైకుపైనే ఒకరు ఉండి మరొకరు ఆమె వద్దకు వచ్చి వివరాలు అడిగేటట్టు అడిగి.. మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లి బైకుపై వెళ్లిపోయారని బాధితురాలు పూర్ణ విలపించింది. అలాగే అంకాలమ్మ గూడూరులో గ్రామానికి చెందిన చిన్నిరెడ్డి తన తోట వద్ద ట్రాక్టర్ ఆపి పనులు చేసుకుంటూ నిమగ్నమై ఉండగా, దొంగ ట్రాక్టర్‌కు ఉన్న బీగం గమనించి స్టార్ట్ చేసుకుని వెళ్లిపోయాడు. రైతు ట్రాక్టర్ శబ్దాన్ని గమనించి బయటికి వచ్చి చూసేసరికి ట్రాక్టర్ చాలా దూరం వెళ్లిపోయింది. దీనితో బాధిత రైతు వెంటనే గ్రామస్తులకు ఫోన్ చేయడంతో వారు ఆ ట్రాక్టర్‌ను వెంబడించి దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి ట్రాక్టర్‌కు తాడుతో కట్టారు. గ్రామస్తులు దొంగను పట్టుకొని దబాయించగా పొంతన లేని సమాధానాలు చెబుతుంటే.. పోలీసులకు సమాచారమిచ్చి పోలీసులకు అప్పగించారు. అయితే ఆ దొంగ నా పేరు సురేష్, నాది అనంతపురం జిల్లా బత్తలపల్లి సమీపంలోని డి.చెర్లోపల్లె గ్రామం అని చెప్పారు.

# వచ్చారు.. వెళ్లారు..!

- సెల్‌ఫోన్‌ల వ్యవహారంలో నామమాత్రం విచారణ
- ఏడుగురిపై సస్పెన్షన్ వేటు వేసి 'మమ' అనిపించిన అధికారులు
- తనిఖీలలో దొరికిన 'గుట్కా–హాన్స్' ప్యాకెట్
- క్షుణ్ణంగా తనిఖీ చేస్తే బయటపడనున్న సెల్‌ఫోన్‌లు



కడప కేంద్ర కారాగారం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కడప కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్‌ల వ్యవహారం మరింతగా కొనసాగుతూనే వుంది. దీనికి కారణం అధికారుల 'నామమాత్రపు విచారణ' అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కడప కేంద్ర కారాగారంలో దశల వారీగా నిర్వహించిన తనిఖీలలో పీడియాక్ట్ రిమాండ్ ఖైదీ జాకీర్ వద్దనే 12 సెల్‌ఫోన్‌లు, ఛార్జర్ దొరికాయి. అయా తనిఖీలలో దొరికిన సమయాలలో విధుల్లో వున్న వారిని బలిపశువులుగా మార్చి ఏకంగా ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్‌లు, ఇద్దరు జైలర్లు, ముగ్గురు వార్డర్‌లను మొత్తం ఏడుగురిని సస్పెన్షన్ చేసి అధికారులు 'మమ' అనిపించారు. తరువాత ప్రతిరోజూ పత్రికల్లో కడప కేంద్ర కారాగారంలో అవినీతిపై కథనాలు ప్రచురితం కావడంతో.. జైళ్లశాఖ డీజీ అంజనీకుమార్ జూలై 29న కడప కేంద్ర కారాగారంలో పర్యటించారు. అంతకుముందు రాజమహేంద్రవరం డీఐజీ ఎం.ఆర్ రవికిరణ్‌ను ప్రాథమిక విచారణ అధికారిగా పంపడంతో.. ఆయన నివేదిక మేరకు పై ఏడుగురిని సస్పెన్షన్ చేశారు. సెల్‌ఫోన్‌లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రాథమికంగా ఆరా తీసి బయటనుంచి పడేస్తున్నారని విచారణలో తేలిందని తెలియజేశారు. డీజీ అంజనీకుమార్ పర్యటనలో భవిష్యత్తులో నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరూ ప్రవర్తించరని 'ప్రామిస్' చేశారని కూడా 'మీడియా'కు బలంగా చెప్పి వెళ్లారు. కానీ రెండు రోజుల్లోనే తనిఖీలలో బయట నుంచి విధులకు వస్తున్న ఓ గైడ్ టీచర్ వద్ద 'గుట్కా–హాన్స్' ప్యాకెట్ దొరకడం ఎంత వరకు సమంజసం? అలాగే కడపలో ఓ యువకుడి హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తు తన అవసరం కోసం సెల్‌ఫోన్‌ను వేల రూపాయలను ఖర్చు చేసి రహస్యంగా తెప్పించుకున్నాడు. ఆ సెల్‌ఫోన్‌ను కడప కేంద్ర కారాగారంలోనే భూమిలో దాచిపెట్టినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే కారాగారంలోకి 'సెల్‌ఫోన్ సరఫరా' ఆపలేరని స్పష్టంగా తెలుస్తోంది. సెల్‌ఫోన్‌లను రహస్యంగా ఎవరు తెస్తున్నారు? ఎలా తెస్తున్నారు? అనే విషయాలపై అధికారులు సమగ్రంగా విచారణ చేయాల్సి వుంది. ఇందుకోసం పోలీసుల సహాయం తీసుకుని 'డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ వారు ఉపయోగించే మెటల్ డిటెక్టర్‌ల సహాయంతో.. కడప కేంద్ర కారాగారాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తే మరిన్ని సెల్‌ఫోన్‌లు, ఇతరత్రా సామగ్రి బయటపడే అవకాశాలు ఉన్నాయి. పిడియాక్ట్ రిమాండ్ ఖైదీ జాకీర్ ప్రధాన గేటు వద్దకు వచ్చి తాను 12 సెల్‌ఫోన్‌లు కాదు! ఇంకా సెల్‌ఫోన్‌లను తెప్పించుకుంటానని సవాలు విసిరిన వైనం పై కూడా.. ఎక్కడి నుంచి సెల్‌ఫోన్‌లను తెప్పిస్తున్నాడో పోలీసుల ద్వారానైనా విచారణ చేయించి నిజానిజాలను తెలుసుకుని 'సెల్‌ఫోన్'ల సరఫరాను కట్టడి చేయాల్సిన బాధ్యత అధికారులపై వుంది. జాకీర్ బంధువులు తమకు సహాయపడే ఓ డిప్యూటీ జైలర్ అనంతపురం 'పీఓఏ'లో విధులను నిర్వహిస్తున్నాడనీ తెలుసుకుని అక్కడికే వెళ్లి, తమకు అనుకూలంగా మాట్లాడుకుని వస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సెల్‌ఫోన్‌లను అమ్ముతున్న, సరఫరా చేస్తున్న వారిని పట్టుకుని, తనిఖీల సమయంలో విధుల్లో వున్న, తమకు సంబంధం లేని అధికారులపై చర్యలను మానుకుని, అసలైన దోషులపై చట్టపరంగా చర్యలను తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎట్టకేలకు కనికరం..!

- ఏడాది తరువాత అన్నదాత సుఖీభవ పథకం అమలు
- నేడు పీఎం కిసాన్, అన్నదాతల నిధులు ఖాతాలకు జమ
- జిల్లాలో 16434 మందికి మొండి చేయి.. ఆందోళనలో అన్నదాతలు

కడప అగ్రికల్చర్ : ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం రైతులపై కనుకరించింది. అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత అన్నదాత సుఖీభవ నిధులను మంజూరు చేసింది. అయితే 2024–25 సంవత్సరానికి సంబంధించిన అన్నదాత సుఖీభవ నిధులపై రైతులకు ఎగనామం పెట్టింది. కాకపోతే కేంద్ర ప్రభుత్వం మాత్రం యథావిధిగా ప్రతి ఏటా పీఎం కిసాన్ నిధులను మాత్రం మంజూరు చేస్తోంది. కానీ కూటమి ప్రభుత్వంఅన్నదాత సుఖీభవ నిధులను ఇవ్వలేదు. అయితే ఎట్టకేలకు ఈ ఏడాది 2025–26 సంవత్సరానికి సంబంధించిన అన్నదాత సుఖీభవ నిధులను మంజూరు చేసింది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా పీఎం కిసాన్ నిధులను మంజూరు చేయనుంది. ఈ రెండు కలిసి శనివారం రైతు ఖాతాలకు నిధులు జమ చేమ కానున్నాయి. ఇందులోను గత వైఎస్ఆర్‌పీసీ ప్రభుత్వం 2,10,481 మందికి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం మాత్రం పలు కారణాల సాకుగా చూపిస్తూ జిల్లాలో 16,434 మంది రైతులకు ఎగనామం పెట్టింది. జిల్లావ్యాప్తంగా 1,94,047 మంది రైతుల ఖాతాలకు మాత్రమే శనివారం నిధులను జమ చేయనుంది. దీంతో అన్నదాత సుఖీభవి నిధులు రాని చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాదికి సంబంధించిన నిధులను ఎగ్గొట్టడమే కాకుండా ఏడాది తరువాత కూడా పలువురు రైతులకు ఎగనామం పెట్టిందని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నేడు రైతు ఖాతాలకు నగదు జమ**

జిల్లా వ్యాప్తంగా 1,94,047 మంది రైతులకు సంబంధించి రూ.97.02 కోట్లు అన్నదాత సుఖీభవ నిధులు కాగా, రూ. 35.91 కోట్లు పీఎం కిసాన్‌నిధులు కలిపి మొత్తంగా రూ. 132.93 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా శనివారం ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేల కలిపి ఒక్కో రైతు ఖాతాకు రూ.7 వేల చొప్పున నిధులు జమకానున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజక వర్గ కేంద్రాలలో సమావేశాలను ఏర్పాటు చేసి ఆయా నియోజక వర్గ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు పాల్గొని రైతు ఖాతాలకు నగదును జమ చేయనున్నారు. అయితే జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్టలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమావేశాలు లేనట్లు తెలిసింది. మిగతా అన్ని నియోజక వర్గాలలో మాత్రం సమావేశాలను నిర్వహించి నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయశాఖ తెలిపింది.

**నియోజక వర్గాల వారిగా నిధుల మంజూరు వివరాలు**

| నియోజకవర్గం | లబ్ధిదారులు | అన్నదాత సుఖీభవ | పీఎం కిసాన్ రూ.కోట్లలో | మొత్తం రూ.కోట్లలో |
|---|---|---|---|---|
| బద్వేల్ | 34148 | 17.07 | 6.17 | 23.25 |
| జమ్మలమడుగు | 35184 | 17.59 | 6.52 | 24.11 |
| కడప | 1576 | 0.79 | 0.19 | 0.98 |
| కమలాపురం | 30700 | 15.35 | 5.69 | 21.04 |
| మైదుకూరు | 34081 | 17.04 | 6.49 | 23.53 |
| ప్రొద్దుటూరు | 10326 | 5.16 | 1.94 | 7.10 |
| పులివెందుల | 41980 | 20.99 | 7.79 | 28.78 |
| రాజంపేట | 6052 | 3.03 | 1.12 | 4.14 |
| మొత్తం | 194047 | 97.02 | 35.91 | 132.93 |